# నల్లంచు తెల్లచీర

—వసంతరావు దేశపాండే

**కాలేజి** లైబ్రరీ హాలు విద్యార్థులతో ఎంతో సందడిగా ఉంది. ఎవరికి కావలసిన పుస్తకాలు వాళ్ళు వెదుక్కుంటున్నారు. షెల్ఫులు చాలా దగ్గర దగ్గరగా అమర్చడం వల్ల, ఎన్ని కిటికీలు ఉన్నా వెలుతురు సరిగా రావటం లేదు. అదీకాక, కరెంట్ లేదేమో ఫాన్స్ తిరగడం లేదు. చాలా ఉక్కగా ఉంది. రాంబాబుకు చిరాకెత్తుతూంది. ఏ పుస్తకమూ దొరకడం లేదు. అసలా లైబ్రరీలో ఉన్న తెలుగు నవలా సాహిత్యమంతా చెత్తగా తయారయింది. మొదటి పేజీలు ఉంటే చివరి పది పేజీలూ జీర్ణం. చివరి పేజీలు సంపూర్ణంగా ఉంటే, మొదటి పది పేజీలూ — అసలు పత్తాలేకుండా అయినా మాయం. కాని, మొదలూ తుదీ ఉంటే, మధ్య పేజీలు ఉండవు. అలాంటి పుస్తకాల్ని అసలు ముట్టుకో బుద్ధికాదు.

శరత్‌బాబు నవల 'శ్రీకాంత్' పేజీలు పరి శీలిస్తూ నిలుచున్నాడు రాంబాబు. "ఎక్స్‌క్యూజ్ మీ!" అన్న తీయని గొంతు వినిపించడంతో పక్కకు తిరిగి చూశాడు. నల్లంచు తెల్లచీరతో ఉన్న ఒక అమ్మాయి దారికి తాను అడ్డంగా నిలబడి ఉండడంతో ఆమె ఆగిపోయి నిలుచుంది. అనుమార్గము అంత ఇరుకుగా ఏర్పాటుచేసిన లైబ్రరీ నిర్వాహక వర్గం మీద విసుక్కుంటూ, ఒక షెల్ఫుకు ఒరిగి నిల బడ్డాడు. ఆ అమ్మాయి మడిచిపెట్టుకున్న దారిలా ముడుచుకుని, తనను దాటుకుని వెళ్ళిపోయింది. రాంబాబు ఆ అమ్మాయి ముఖాన్ని సరిగా చూడలేదు. కానీ, నల్లంచు తెల్లచీరను మాత్రం మరోసారి చూడకుండా ఉండలేకపోయాడు.

పుస్తకాలు తీసుకుని లైబ్రేరియన్ దగ్గరికి వెళ్ళి, పుస్తకం టేబుల్ మీద పడేసి, చెమట తుడుచు కుందామని కర్చీఫ్ కోసం జేబులో చేయి దూర్చాడు. హఠాత్తుగా ఏదో జ్ఞాపకం వచ్చింది. జేబులు తడుముకున్నాడు. మళ్ళీ ఏదో గుర్తుకు వచ్చి, ఇందాకా తాను రిటర్న్ చేయడానికి తెచ్చిన పుస్తకం కోసం టేబుల్ మీద వెతికాడు. అది కనిపించక పోవడంతో అతని కంగారు మరీ హెచ్చింది.

"ఏమండీ! ఇందాకా ఇక్కడ ఒక నవల పెట్టాను. ఏది?" అన్నాడు లైబ్రేరియన్‌ను ఉద్దేశించి.

అతను అప్పుడే వచ్చిన దిన పత్రికలో వార్తలు చూసుకుంటున్నాడు. గ్రహస్థితి బాగా లేదేమో—ఆయన ముఖ కవళికలు కూడా అంత బాగా లేవు.

"ఏ నవల?" అన్నాడు చేతిలోని పత్రికను మడుస్తూ, చిరాకుగా.

" 'హేంగ్ మా క్విక్!' "

"ఓ! అదా? ఇందాకా ఒక అమ్మాయి పట్టు కెళ్ళింది."

"పట్టుకెళ్ళిందా! చచ్చాం! ఏదీ ఆమె?" చుట్టూ చూస్తూ గాభరాగా అడిగాడు రాంబాబు.

"వెళ్ళిపోయింది. అయినా, ఆ పుస్తకం తిరిగి ఇవ్వడానికేగా తెచ్చారు? ఇంకా దానితో ఏం పని?"

"ఉంది. చూడండి, ఆ అమ్మాయి పేరేమిటో చెబుతారా?"

లైబ్రేరియన్ కార్డు చూసి, "మిస్ మంజరి, బి. ఎ. ఫస్ట్ ఇయర్. అయినా, ఎందుకూ? ఆమెతో ప్రేమలేఖేమైనా పెట్టారా ఏ..?" అన్నాడు పెద్ద పరిశోధకుడిలా పోజు కొడుతూ.

రాంబాబు లైబ్రేరియన్ మాటలు పట్టించుకో లేదు. 'మంజరి' అని ఒకసారి మననం చేసుకొని, "సార్! ఆ అమ్మాయి నల్లంచు తెల్లచీరలో ఉంది కదూ?" అన్నాడు.

"ఏమో? అయినా, మిస్టర్, ఇక్కడికి వచ్చే అమ్మాయిలు ఏ రంగు చీరలు కట్టుకొస్తారో, ఏ కంపెనీ చెప్పులు వేసుకొస్తారో చూడడమేనా నా పని?"

ఇక అతనితో మాట్లాడి ప్రయోజనం లేదని గ్రహించి బయట పడ్డాడు. మంజరి అంటే ఆ నల్లంచు తెల్లచీర అమ్మాయా, కాదో? ఎవ

రిని అడిగితే తెలుస్తుందా? అంటూ అతనికి బి. ఎ. స్టూడెంట్ కుసుమ కనిపించింది. "హల్లో, కుసుమా! మంజరి నీకు తెలుసు కదూ? ఆమె కనిపించిందా?"

"అవును. కనిపించింది కాస్సేపటి క్రితం. ఎందుకూ?"

"ఏమీ లేదు." అన్నాడు, వద్దు అనుకుంటూనే — "ఈ రోజు ఆమె ఏ డ్రెస్‌లో ఉంది?" అన్నాడు.

అతను ఎందుకు అడుగుతున్నాడో అర్థం కాలేదు. అయినా, నవ్వుతూనే జవాబు చెప్పింది: "నల్లా తెల్ల చీరలో ఉందనుకొంటాను."

"ఆ! కరెక్ట్! నల్లంచు తెల్ల చీరలో కదూ?"

"అవునవును! నల్లంచు తెల్లచీరలో" అంది.

"థాంక్స్, కుసుమా! వస్తా!" అంటూ ముందుకు కదిలాడు. కుసుమ అతని ప్రవర్తనకు ఆశ్చర్య పోయి, అలాగే చూస్తూ నిలుచుంది.

తొందర తొందరగా అడుగులు వేస్తూ వస్తున్నాడు. కానీ, మంజరి కనిపించలేదు. కంగారు ఎక్కువయింది. కాలేజీ నుంచి ఊరు ఒక మైలు దూరం. నడిస్తే కానీ, సాయంత్రం సిటీ బస్ దొరకదు. స్టేషనుకి వెళ్ళడానికి అది ఒక్కటే దారి. ఆ లోపలే ఆమెను పట్టుకోవాలి. లేకుంటే దొరకటం కష్టం. అతని నడక ఇంకా వేగాన్ని పుంజుకుంది.

దూరంగా కనిపించింది నల్లంచు తెల్లచీర. రాంబాబు ప్రాణం కొత్త కుదుటపడింది. ఆమె వెనక్కి తిరిగి చూస్తే, ఆగమని సైగ చేదామను కున్నాడు. కాని, ఆమె మొదటిసారి చూడకుండా నడుస్తూంది.

మళ్ళీ ఒకసారి అనుమానం వచ్చి పాంటు జేబులు వెతుక్కున్నాడు. 'ఏవో' కాగితాలు, ఒక పెద్ద ఉత్తరం చేతికి వచ్చాయి. వాటిని తిరిగి భద్రంగా జేబులో పెట్టి, 'ఈ ఆమెను ఎలాగైనా కలవాలి. లేకపోతే లాభంలేదు' అనుకుని నడక వేగం పెంచాడు, అయినా, తనూ మధ్య గల దూరాన్ని తగ్గిస్తున్నాడు. అయినా, ఆమె అందటం లేదు. 'పరుగెత్తితే అమ్మో! చూసేవాళ్ళు పిచ్చివాడను కొంటారు' అనుకొని, ఆ ఆలోచన మానుకుని, నడక వేగాన్ని ఇంకా పెంచుతాడు. మంజరి కూడా వేగంగానే నడుస్తున్నదున్ను. పాపం! రాంబాబుకు ఆమె అందడం లేదు. 'ఈ లాభం లేదు. పిలవడం తప్ప గత్యంతరం లేదు.' ఒక్కసారి గొంతు సవరించుకొని, "మేడమ్!" అన్నాడు.

అమ్మాయిగారికి వినిపించినట్లుంది. వెనక్కి తిరిగి చూసింది. 'ఆగ వచ్చునా' చేతితో సైగ చేశాడు. ఆమె ఆగకుండా వెళుతోంది. రాంబాబు ప్రాణం కుదుటపడింది. తను నమ్మకుని, తొందరగా నడక సాగించాడు. మంజరికి రాంబాబు తెలియదు. కాని, అతను సైగ చేయడంతో అలా తొందరగా ఆగిపోయింది. తరవాత ఆలోచించింది 'ఎందుకు రమ్మంటున్నాడబ్బా?'— అని. 'అయినా, ఈయనకు నాతో ఏం పని? అతను దగ్గరికి వచ్చి పలకరిస్తే, నేను మాట్లాడగలనా? వెంట నా ఫ్రెండ్స్ కూడా ఎవరూ లేరు. కర్మ' అనుకుంది. 'అతను వస్తున్నాడు. పారిపోనా, వద్దా? పోనీ, ఆగితే? తీరా అతను వచ్చి, ప్రేమా గీమా అని మొదలుపెడితే?' మంజరికి ఎక్కువగా భయం వేసింది. వెంటనే మళ్ళీ నడక ప్రారంభించింది.

వెనకనుంచి అతని గొంతు మళ్ళీ వినిపించింది.

"మేడమ్! ప్లీజ్ ఆగండి!"

మంజరి ఇంకా వేగంగా నడుస్తూనే ఉంది.

మళ్ళీ పిలిచాడు. "మంజరిగారూ? ప్లీజ్! ప్లీజ్! ఆగండి!"

'అయ్యో, దేవుడా! పేరుకూడా కనుక్కొన్నాడు. ఇక్కడే నుంచే నడి రోడ్డు మీదే "డేట్" అడుగుతున్నాడు. ఇది ఖచ్చితంగా ప్రేమ పైత్యమే. నా దగ్గరికి వచ్చి, నడిరోడ్డు మీద పట్టుకుని "నా రాణీ" అంటే నా గతి ఏమిటి? అయినా, తన

పే రితని కెలా తెలిసింది? ఇప్పు డెలా? ఇక పరుగెత్తక పోతే లాభం లేదు' అనుకొని పరుగులా నడవడం ప్రారంభించింది. ఆమె నల్లంచు తెల్లచీర కుచ్చెళ్ళు గమ్మత్తుగా ఆమె పాదాలను ముద్దాడు తున్నాయి.

ప్రేమలో పడ్డ అబ్బాయిలకు ఒక చిక్కు. ఎక్కడి నుంచో వెంటాడతారు—సమయం దొరికిన చోట తమ గోడు సవినయంగా విన్నవించుకొని, తమ ప్రేమ పత్రాన్ని సమర్పించుకోవాలని. కాని, ఆమె జనసమ్మర్దం లేని చోట చిక్కగానే, ఎవడో ఒకడు కలుస్తాడు. అప్పుడు కలిసినవాడు ప్రాణ మిత్రుడైనా నాలుగు తన్ని తగలేయాలనిపిస్తుంది. కాని, కుదరదు. ఆ కలిసిన వాడు ఎక్కడికీ? ఏం విశేషాలూ? అంటూ చెత్త ప్రశ్నలు వేసి విసిగిస్తాడు. వాణ్ణి ఎలాగో ఒకలాగు వదిలించుకొనే లోపల ఆ అమ్మాయి మాయం కావడం సహజం.

ప్రస్తుతం రాంబాబు గతీ అంతే అయింది. ఎదురుగా సైకి లెక్కి వస్తూన్న సుబ్బారావు అతనికి తెలుగు సినిమాల్లోని విలన్‌లాగా కనిపించాడు.

"హల్లో! రాంబాబూ! ఎక్కడికి? హాస్టల్ కేనా?"

"హల్లో! అవును. హాస్టల్‌కే. నువ్వెక్కడికి?" అన్యమనస్కుడై అడిగాడు.

"వూరికేనే బయలు దేరాను. పద. నేనూ హాస్టల్‌కు రావాలి. కాస్త పనుంది. కమాన్! ముందు హొటల్లో కాఫీ తీసుకుని పోదాం!" రాంబాబు చేయి పట్టుకుని అడిగాడు.

"సారీ, సుబ్బారావ్! నాకు పనుంది. వెరీ అర్జెంట్" అంటూ వెనక్కు తిరిగి చూసిన మంజులకు ఆగమంటూ సైగ చేశాడు, సుబ్బారావుకు తెలియకుండా.

మంజులకు రాంబాబు తన వేపు చూపుతూ మాట్లాడుతున్నట్లు కనిపించింది. 'అంటే— ఇంకేం? నేను ప్రేమిస్తూన్న అమ్మాయి అదిగో! అని అప్పుడే తన కోతి మూకకు పరిచయం చేస్తున్నాడు.' మంజులకు క్షణకాలం మగవాళ్ళంటే అసహ్యం కలిగింది.

"ఏమీ అనుకోకు, బ్రదర్! వెరీ అర్జెంట్! వెళతాను."

"దానికేం, బ్రదర్? మరీ అంత అర్జంటైతే ఇదుగో—ఈ సైకిల్ తీసుకెళ్ళు. నేను హాస్టల్లో ఉంటాను. తొందరగా వచ్చేయి."

తను ఇంతవరకు సుబ్బారావును సైకిల్ అడగ నందుకు తన బుద్ధితక్కువతనానికి తన్ను తాను తిట్టుకున్నాడు రాంబాబు. "థాంక్స్, బ్రదర్! ఇప్పుడే ఒక అయిదు నిమిషాల్లో వచ్చేస్తా" నని సైకి లందుకున్నాడు.

'ఇంత సేపటినుంచీ ఆగమంటే ఆగకుండా వెళతావా? ఇక ఇప్పు డెక్కడికి పోతారో అమ్మాయి గారు?' అని మనసులో అనుకొని, గట్టిగా పెడల్‌పై కాలువేశాడు రాంబాబు.

వెనక్కు తిరిగి చూసిన మంజులకు సైకిల్‌పై వేగంగా వస్తూన్న రాంబాబు కనిపించాడు. 'అయ్యో, దేవుడా! ఇంకేం గతి? వదిలేలా లేడు! ఇప్పు డెలా?' అనుకొని గబగబా నడుస్తూ బస్ స్టాండ్ చేరింది. తను ఇంటికి వెళ్ళవలసిన బస్ లేదు. అది ఎంత లేటో? వెంటనే అక్కడ ఉన్న బస్‌లో ఎక్కి కూర్చుంది.

రాంబాబు చూస్తూండగానే బస్ కదిలింది. వెంటనే సైకిల్ దిగి, దాని నో షాపు ముందు స్టాండ్ చేసి పరుగెత్తాడు. పడుతూ, లేస్తూ బస్సు అందుకున్నాడు చివరికి. పాపం! మంజులకు తెలియదు— రాంబాబు బస్సెక్కాడని. 'ఆ డొక్కు సైకిల్‌తో ఈ బస్సు నేం అందుకోగలడు? పూర్ ఫెలో!' అనుకుని నవ్వుకుంది.

ముఖానికి పట్టిన చెమటను కర్చీఫ్‌తో తుడుచుకొని, కూర్చునేందుకు సీటు లేక నిలబడ్డాడు రాంబాబు. ముగ్గురు కూర్చోవలసిన మగవాళ్ళ సీట్ మీద మంజుల ఒక్కర్తే కూర్చుని ఉంది. 'పోనీ, వెళ్ళి పక్కను కూర్చుని, మాట్లాడి, వచ్చే స్టేజిలో దిగేస్తే? ఏమో? మాట్లాడు తుందో, లేకుంటే అల్లరిపెడుతుందో! ఒక వేళ అల్లరి పెడితే? బస్సులోని వాళ్ళు తనను ఉచితంగా ఉచిత రీతిని దేహ శుద్ధి చేసి మరీ వదులు తారు. ఆమె అల్లరి పెడితే కూడా తాను నిలబడ గలగడానికి ఎవరిదైనా మద్దతు లభిస్తుందా' అని బస్సంతా కలియజూశాడు. తన ఈడు వాళ్ళు, ముఖ్యంగా కాలేజీ కుర్రవాళ్ళు ఎవ్వరూ లేరు. అంతా దేహశుద్ధి చేసే వారి లాగానే కనిపించారు. ముఖ్యంగా ఆ సర్దార్జీని, అతని కండలు తిరిగిన శరీరాన్ని చూసి మంజుల పక్కను కూర్చునే ఆలోచనను పక్కకు నెట్టాడు. అంతలోనే కండక్టర్ గొంతు చేదుగా వినిపించింది—"టికెట్ ప్లీజ్" అని.

అతని జేబులో నయాపైసా లేదు. అయినా, మళ్ళీ తడుముకున్నాడు, జేబులో చేయి పెట్టి. అతనికి బాగా తెలుసు. నాలుగు జేబుల్లోనూ కలిసి నాలుగు పైసలైనా లేవని. అయినా కండక్టర్ ముందు అదో పోజు. డబ్బు ల్లేవు. ఇప్పుడెలా? ఇంత దాబుగా బట్టలు వేసుకొని, కనీసం చిల్లర డబ్బులు లేకుండా బస్సెక్కితే, వీళ్ళంతా ఏమను కుంటారు. ముఖ్యంగా మంజుల మంజులంగా నవ్వదూ నన్నుచూసి? ఆవిడ అలా నవ్వితే తను భరించ గలడా? ఏమో!

రాంబాబు బుర్రకు బ్రహ్మాండమైన ఐడియా తట్టింది. తట్టిందంటే తట్టదూ మరి? ఆరు నెలల నించి బుర్రకు ఆముదం నూనె పెడుతున్నాడు రోజూ. (వెంట్రుకలు పండిపోతున్నాయి!) ఈ కండక్టర్ దృష్టిలో చులకన అయ్యే కన్నా ఆ అందమైన అమ్మాయితో చీవాట్లు తినడమే నయమనిపించింది రాంబాబుకు. అయినా ప్రస్తుతం తన దగ్గర ఏముందని? అతని సర్వస్వమూ మంజుల దగ్గరే ఉంది. అసలు రాంబాబు తన హృదయాన్నో మనస్సునో మరిదేన్నో ఇవ్వటానికో లేక తీసు కోవటానికో ప్రస్తుతం ఆమెవెంట పడ్డాడనిపించింది.

వెంటనే తొణకకుండా "రెండు టికెట్లూ ఆ అమ్మాయి దగ్గర తీసుకోండి" అన్నాడు.

కండక్టర్‌కు అర్థంకాక—"ఏ అమ్మాయి?" అన్నాడు, అయోమయంగా.

నిజమే. అక్కడచాలామంది అమ్మమ్మలు, బామ్మలు ఇంకా అమ్మాయిలు ఉన్నారు. పాపం! ఎవరినని అడుగుతాడు? "మంజుల దగ్గరినుండి" అని చెబుదామనుకున్నాడు. కాని, కండక్టర్‌కు అమ్మాయే తెలియనప్పుడు, మంజుల ఎలా తెలుస్తుంది? అందు కని ఆ నల్లంచు తెల్ల చీర అమ్మాయి దగ్గరి నుండి అన్నాడు. కండక్టర్ ముందుకు కదిలాడు.

రాంబాబు మంజులనే చూస్తున్నాడు. రెండు జడలూ ముందుకు వేసుకుని (వెనకకు వేసుకుంటే ఎవరైనా లాగుతారనేమో), రెండు చేతులతోనూ పుస్తకాలు పట్టుకుని, అందంగా గడ్డానికి ఆనించు కొని కూర్చుంది. ఆ పుస్తకాలకు పట్టిన అదృష్టాన్ని చూసి కొంచెం అసూయకు లోనయ్యాడు రాంబాబు. అమాయకంగా ఉన్న ముఖం పైకి ఎగిరి పడు తున్న కురులు, చెదిరిన కాటుక కళ్ళు శ్రావణ మేఘాల్లా కనిపించాయి. ఆమె అందానికి ముగ్ధుడై తదేకంగా చూస్తున్నాడు.

మంజుల రాంబాబు కన్నా రెండేళ్ళు జూనియర్. ఆమెను కాలేజీలో చాలా సార్లు చూశాడు. కాని ఇంత పరీక్షగా ముందు ఎప్పుడూ చూడలేదు. ప్రస్తుతం ఆ నల్లంచు తెల్ల చీరలో చాలా అందంగా కనిపిస్తూంది. ఆ నల్లంచు చందన వృక్షానికి చుట్టు కున్న త్రాచులా కంటికి ఇంపుగా ఉంది.

కండక్టర్ టికెట్స్ పంచ్ చేస్తూ, మంజుల కేసి చూసి, "ఎక్కడికమ్మా?" అన్నాడు. చెప్పింది, పర్సు తెరిచి ఒక టికెట్‌కు సరిపడే చిల్లర తీసి ఇస్తూ.

"ఇంకా ఇరవై పైస లివ్వండి" అంటూ రెండు టికెట్స్ ఆమె చేతిలో పెట్టాడు.

"రెండెవరికి? నేనొక్కర్తినే" అంది ఆశ్చర్యంతో.


"అతని దగ్గర చిల్లర లేదట. మీ దగ్గరే తీసుకో మన్నాడు" అంటూ రాంబాబు కేసి చూశాడు కండక్టర్.

ఈ 'అతను' ఎవరా? అనుకుంటూ వెనక్కు తిరిగి చూసింది. అంతే. ఆమె ఆశ్చర్యానికి అంతు లేదు. రామేశ్వరం వెళ్ళినా శనేశ్వరుడు వదలడన్న సామెత గుర్తుకు వచ్చిందామెకు. సూటిగా, వాడిగా అతడి కళ్ళలోకి చూసింది. అతడు నవ్వుతూ ఆమె వైపు చూశాడు. అతని ముఖంలో అభ్యర్థన ఉంది.

కాని మనస్సులో అంతా అసహ్యం నింపుకుని ఉన్న ఆమెకు రాంబాబు కళ్ళలోని అభ్యర్థన కనిపించ లేదు. మనసులోని అసహ్యాన్ని కళ్ళలోంచి రాలుస్తూ చూపు మరల్చుకుని మిగతా చిల్లర డబ్బులు తీసి ఇచ్చింది కసిగా.

ఆమె ఎక్కడి వరకు టికెట్ తీసుకుందో తెలి యదు రాంబాబుకు. ఆమె ఎక్కడ దిగుతుందో నని ఎదురు చూస్తున్నాడు, ప్రతి స్టేజిలో. ఆమె దిగ లేదు. కాని, ఎక్కే వాళ్ళు ఎక్కడంతో, ఇప్పుడు అతనికి మంజుల కనిపించడం లేదు. ఆమె దిగిన స్టేజి లోనే తనూ దిగాలి. లేకుంటే తను ఇప్పటివరకు పడిన శ్రమ అంతా వ్యర్థమే.

అనుకున్నంతా అయింది. ఇదే అదననుకుని మంజుల దిగిపోయింది, అతనికి తెలియకుండా.


PARWATHISAM

"టికెట్‌ప్లీజ్" అంటూవచ్చిన కండక్టర్ "—మీరు దిగలేదా, సార్? నెక్స్టు స్టేజిలో దిగండి" అన్నాడు.

"ఆ అమ్మాయి. . ."

"దిగిపోయిందండీ. ఇప్పుడే వెనక స్టేజిలో..."

"సారీ! కాస్త స్లో చేస్తారా? నేను దిగిపోతాను" అన్నాడు.

"రెండు నిమిషాలు ఆగండి. తరవాతి స్టేజిలో దిగుదురు గాని" అన్నాడు కండక్టర్ విసుగ్గా.

'తరవాతి స్టేజి అంటే పుణ్యకాలం కాస్తా దాటిపోతుంది' అనుకొని బస్ ఒక కార్నర్‌లో టర్న్ అవుతూండగా దిగేశాడు. నడుస్తూన్న బస్‌లోంచి దిగడంతో తూలి పడబోయి, ఎలాగో సంబాళించు కున్నాడు. అయినా కాలు బెణికింది.

మంజుల దిగిన స్టేజి అక్కడికి ఫర్లాంగు దూరం ఉంటుంది. వెనక్కి వెళితే కలుస్తుందేమోనని నడుస్తున్నాడు కుంటుతూ. ఎదురుగా మంజుల నడుస్తూ కనిపించింది. ఆమెను చూడగానే కాలునొప్పిగా ఉన్నా, మామూలుగా నడవడం మొదలు పెట్టాడు.

రాంబాబు మంజుల వెంటపడంగా నడుస్తున్నాడు. ఓరగా గమనిస్తూంది మంజుల. అప్పుడే పెళ్లి అయిందనుకుంటే, ఇక పిరికిగా ఉంటే లాభం లేదని. అప్పుడని ప్రవర్తన ఎప్పుడూ ఆమెపై కోపంతోబాటు అసహ్యంకూడా కలిగించేది. ఇప్పుడేమైనా అంటే మాటలతో దులిపేయాలి. అంతకూ వినకపోతే చేతిలోని నవలతో గట్టిగా కొట్టాలనుకుంది.

ఎలా మాట్లాడాలో అర్థం కావడం లేదు రాంబాబుకు. లోపల గుండె ఆగడం లేదు. రిహార్సల్ వేసుకొన్న నాటకంలోని డైలాగ్ మరిచిన నటుడిలా ఉండి ఉండి చూస్తున్నాడు. చివరికి ఎలాగో — "చూడండి! మీతో ఎలా మాట్లాడాలో అర్థం కావడం లేదు. నిన్న అలా ప్రవర్తించినందుకు చాలా సిగ్గుపడుతున్నాను. నిజంగానే నా దగ్గర చిల్లర లేకపోయింది. నా మాట నమ్మండి. అయినా, మీరు అంత హడావిడిగా నన్ను వెక్కిరిస్తారని తెలియదు. దయచేసి నన్ను క్షమించండి. ఒక్కసారి ఆ నవల ఇలా ఇవ్వండి" అని ఏక బిగిని మాట్లాడేశాడు. అతని గొంతు అతనికే వింతగా వినిపించింది.

"యెస్, మిస్టర్! ఏమిటి నీ ఉద్దేశం? కాలేజీ నుంచి చూస్తున్నాను నీ ప్రవర్తన. అమ్మాయిల వెంట పడటమేనా నీ పని?"

"అది కాదండీ! ఒక్కసారి ఆ నవల ఇటు ఇవ్వండి! అందులో ..."

"ఈ నవలకోసం ఇంత దూరం వెంటపడవలసి వచ్చిందేం? నవలలో ఏముంది? తీసుకొని ప్రేమలేఖ పెట్టి ఇస్తారా? ఒంటరిగా ఉన్న ఆడపిల్ల అంటే ఎందుకింత చులకన? నాలాంటి వెర్రివాళ్ళు..."

"మిస్ మంజులా! అధిక ప్రసంగం చేయకు! నేను ..."

"మీ దారిని మీరు వెళ్లండి. అనవసరంగా నన్ను వెంబడించకండి. వెంబడించి ఏం ప్రయోజనం లేదు. ప్రేమా గీమా అని గేలం వేశారా— కాలే ప్రిన్సిపల్‌కు రిపోర్ట్ చేస్తాను. ఇంకో విషయం చెప్తు కాలేజీలో పలుగురి ఎదుటా 'ఇడియట్ నిన్నటి చిల్లర' అని పెద్ద పోజు కొట్టకండి. అలా జరిగిందా మర్యాద దక్కదు! ఆ మాత్రం చిల్లర లేకున్నా ఆ పోజులెందుకు? కావాలంటే ఇంకా ఒక రూపాయి చిల్లర ఇస్తాను—వచ్చిన దారినే వెళ్ళిపోండి."

"మంజులా! నీ ఉదారత్వానికి చాలా సంతోషించాం కాని, ఇక మాట్లాడకు! పోనీలెమ్మనుకొనే కొద్దీ శ్రుతి మించి రాగాన పడుతున్నావు. నేను నీ వెంట పడ్డది నీ ప్రేమభిక్ష కోసం కాదు."

మంజుల అహంభావం ఒక్కసారి దెబ్బ తింది. "ఏమిటీ? ఇతను తన అందానికి వెర్రివాడై ప్రేమ భిక్షకు పడలేదా తన వెంట? తా ననుకొన్నది పొరపాటా? అతనంటే కోపం, అసహ్యం ఉన్నా, ఒక అందమైన యువకుడు తన అందంతో వెర్రివా డైనాడని మనసులో ఎక్కడో ఒక మూల గర్వ పడింది. అందుకే ఇష్టం లేకున్నా టికెట్ తీసింది. ప్రతి ఆడపిల్లా అంతే! తనకు ఇష్టం ఉన్నా, లేక పోయినా తన వెంట ఎంత మంది అబ్బాయిలు పడితే, తను అంత అందగత్తె ననుకుంటుంది. అమ్మాయిలు అలా అనుకోని వాడు వెర్రిగా షోకు చేసుకోవలసిన అవసరమే ఉండదు. వెంటపడే అబ్బాయిల సంఖ్యను బట్టి తమ అందం మీద వారికి ఉన్న గర్వం పెరుగుతుంది.

"చూడండి! మీతో నాకు అనవసర ప్రసంగం దేనికి? మీ చేతిలో ఉన్న ఆ నవల మీకివ్వా ముందు నేను తీసుకు వెళ్ళాను. అనుకోకుండా అందులో వంద రూపాయల నోటు ఒకటి పెట్టి మరిచిపోయాను. అందుకే మీ వెంట పడ్డాను. అంతేకాని, మీ ప్రేమ భిక్షకు కాదు. మీ దయా దాక్షిణ్యాలకు అంతకన్నా కాదు. వెంటనే అందులోని నోటు ఇచ్చేస్తే, మీ దారి మీది, నా దారి నాది."

"ఏమిటీ? ఈ నవలలో నోటుందా?" అంది ఆశ్చర్యంగా.

"చూడండి—మీకే తెలుస్తుంది."

మంజుల పుస్తకం తెరిచి చూసింది. మధ్య పేజీల్లో నోటు ఎక్కడా కనిపించలేదు. ఇదేదో నాటకంలా ఉందనిపించింది. అతను తన పరిచయం కోసం మంచి ప్లాన్ వేశాడు. నిజమే, ఆ మాత్రం సమయస్ఫూర్తి లేనివాడు ఇంత నిర్భయంగా వెంబడి స్తాడా?

"మీ నోటు ఇందులో లేదండీ" అంది, కసిగా రాగం తీస్తూ.

"వాట్?! అందులో నోటు లేదా?" అంటూ అంతవరకూ ప్రశాంతంగా ఉన్నవాడు వెంటనే పుస్తకం లాక్కుని, చివరి పేజీకి, కవర్‌కూ మధ్య చూశాడు. అతని కళ్ళు ఒక్కసారి మెరిశాయి, నవ్వడంగా.

"ఇదేమిటండీ? ఉందిగా? అమ్మయ్య! అనవ సరంగా చెమటలు పట్టేలా చేశారు!" అన్నాడు, గుండె నిండా గాలి పీల్చుకుని.

తన చేతిలోని పుస్తకంలోకి తొంగి చూసింది. నిజమే! గాలికి రెపరెపలాడుతూ, నవ్వుతూ ఉన్నట్లు కనిపించింది సరికొత్త వంద రూపాయల నోటు.

సరికొత్త వంద రూపాయల నోటును నాజూకుగా మడత పెడుతూ—"వస్తానండీ" అని, "క్షమించండి. వెళతాను" అంటూ ముందుకు కదిలాడు.

కాలు బెణికిందేమో — కాస్త కుంటుతూ నడుస్తున్నాడు. అత నలా వెళుతూ వెళుతూ ఒక్క సారి అయినా వెనక్కి తిరిగి చూస్తాడనుకుంది. కానీ, రాంబాబు అలా వెళ్ళిపోతూనే ఉన్నాడు.

మంజుల చేతిలోని రెండు బస్ టికెట్లు నవ్వు తున్నట్లో, వెక్కిరిస్తున్నట్లో కాని గాలిలో ఎగిరి పోయాయి. ★

